ప్రజాశక్తి
సోమవారం 3 జులై 2023



అంబులెన్స్ సిబ్బందికి ఆటల పోటీలు

ప్రజాశక్తి-హుకుంపేట:అరబిందో ఎమర్జెన్సీ మెడికల్ సంస్థ మూడవ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలో ఆదివారం 108,104,102 అంబులెన్స్ పైలెట్లు, టెక్నీషియన్స్, డేటా ఆపరేటర్లకు క్రికెట్, షటిల్ కాక్, చైర్ ఆటలను నిర్వహించారు. ఈ సందర్భంగా గెలుపొందిన విజేతలకు అరబిందో కంపెనీ ఆధ్వర్యంలో బహుమతులను అందజేశారు. అనంతరం అరబిందో ఎమర్జెన్సీ మెడికల్ సంస్థ అల్లూరి సీతారామరాజు జిల్లా మేనేజర్ మురళి మాట్లాడుతూ, నిత్యం ప్రజలకు సేవలు అందిస్తున్న అంబులెన్స్ సిబ్బందికి కొంత ఉపశమనం కలిగించడంతో పాటు వారిని ప్రోత్సహించేందుకు ఆటల పోటీలను నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ ఒఇ రామసూరి, 108 ఒఇ ఇబ్రహీం పాల్గొన్నారు.


బహుమతులు ఇస్తున్న ప్రతినిధులు

ఉత్సాహభరితం.. ఉత్తేజపూరితం

- కృష్ణా జిల్లాలో సాగిన పోలవరం పోరుకేక మహాపాదయాత్ర
- బాపులపాడు, ఉంగుటూరు, గన్నవరంలో ఘనస్వాగతం

పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు పరిహారం ఇచ్చిన తర్వాతే ప్రాజెక్టు పనులు పూర్తిచేయాలని కోరుతూ సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు నేతృత్వంలో 'పోలవరం పోరుకేక' మహాపాదయాత్ర ఉత్సాహంగా కొనసాగుతోంది. కృష్ణాజిల్లాలోని బాపులపాడు, ఉంగుటూరు, గన్నవరం మండలాల్లోని పర్యటించిన అన్ని గ్రామాల్లోని ఆయా గ్రామాల ప్రజానీకం, రైతులు, కూలీలు, సిపిఎం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పూలవర్షం కురిపించారు. కొన్నిచోట్ల మహిళలు హారతులు ఇచ్చారు. 13వ రోజు మండుటెడను, వేడిగాలులను సైతం లెక్కచేయకుండా యాత్ర బృందం ముందుకు సాగింది. 13వ రోజు ఆదివారం బాపులపాడు మండలం హనుమాన్ జంక్షన్ నుంచి గన్నవరం వరకూ కొనసాగింది. అల్లూరు సీతారామరాజు, ఏలూరు, కృష్ణాజిల్లాలోని 11 మండలాల్లో యాత్ర పూర్తి చేసుకుంది.

ప్రజాశక్తి - కృష్ణాప్రతినిధి, గన్నవరం

సిపిఎం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోలవరం పోరుకేక మహా పాదయాత్రకు కృష్ణాజిల్లాలో అడుగడుగునా ఘనస్వాగతం లభిస్తోంది. బాపులపాడు మండలంలో ఆదివారం 13వ బృందం పర్యటించింది. మండుటెడను, వేడిగాలలను సైతం లెక్కచేయకుండా ముందుకు సాగింది. గ్రామ గ్రామాన పేదలు, రైతులు, కూలీలు, టిడిపి, వైసిపి నాయకులు యాత్రపై పూలవర్షం కురిపించారు. నిర్వాసితుల పోరాటానికి తమ మద్దతు ప్రకటించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు నేతృత్వంలో సాగుతున్న యాత్ర బాపులపాడు మండలం హనుమాన్ జంక్షన్ నుంచి ఆదివారం బయలుదేరింది. వీరవల్లి ముఖద్వారం వద్దకు రాగానే తెలుగు రైతు రాష్ట్ర నాయకులు గుండపనేని ఉమావరప్రసాద్ స్వాగతం పలికి సంఘీభావం ప్రకటించారు. గ్రామంలోని సచివాలయం సెంటర్లో ఆశా వర్కర్లు, అంగన్వాడీ ఉద్యోగులు స్వాగతం పలికారు. అనంతరం ఎన్టీఆర్ బొమ్మ సెంటర్‌లో వైసిపి నాయకులు కృష్ణప్రసాద్, చిలకపాటి పద్మనాభరావు, ఇతర రైతు నాయకులు, గ్రామ పెద్దలు యాత్రకు పూలతో స్వాగతం పలికారు. యాత్ర బృందానికి మజ్జిగ, మంచి నీరు అందించారు. అంగన్వాడీ, ఆశా ఉద్యోగులు యాత్ర సారధి శ్రీనివాసరావును కలిసి తమ మద్దతు తెలిపారు. కోడూరుపాడు పంచాయతీలోని ఉమామహేశ్వరపురంలో యాత్రకు వ్యవసాయ కార్మికులు స్వాగతం పలికారు. శ్రీనివాసరావుకు మహిళలు వీర తిలకం దిద్దారు. యాత్ర బృందం సభ్యులకు మజ్జిగ అందజేశారు. అనంతరం పాదయాత్ర బాపులపాడు మండలం అంపాపురం మీదుగా ఉదయం 8 గంటలకు బయలుదేరిన యాత్ర మధ్నాహ్నం 12 గంటలకు తేలప్రోలుకు చేరింది. తేలప్రోలులో పార్టీ నాయకులు టి.వి.లక్ష్మణస్వామి, ఉంగుటూరు మండలకార్యదర్శి అజ్మీర వెంకటేశ్వరరావు, వెన్నూతల సర్పంచ్ తెల్లాకుల రామ్మోహనరావు, పార్టీ సీనియర్ నాయకులు పిల్లి రాజారావు, సలీమ్, భీమవరపు సుబ్బారెడ్డి తదితరులు స్వాగతం పలికారు. నాయకులకు పూలమాలలు వేశారు. పొట్టిపాడులో పార్టీ నాయకులు, రైతులు స్వాగతం పలికారు. ఆత్కూరులో ఎన్టీఆర్ విగ్రహానికి సిపిఎం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పెద్ద ఆవుటపల్లిలో ఉపాధి కూలీలు, మహిళలు పెద్దఎత్తున స్వాగతం పలికారు. యాత్రబృంద నాయకులకు పూలమాలలు వేసి రెడ్ సెల్యూట్ చేశారు. అనంతరం చిన ఆవుటపల్లి మీదుగా పాదయాత్ర గన్నవరం చేరకుంది. పిన్నమనేని ఆసుపత్రి వద్ద గన్నవరం మండలానికి చెందిన సిపిఎం నాయకులు స్వాగతం పలికి నాయకులపై పూలవర్షం కురిపించారు. మధ్నాహ్నం తేలప్రోలు ఐటిఐ కాలేజీలో విరామం తర్వాత బయలుదేరిన యాత్ర పొట్టిపాడు, ఆత్కూరు, అవుటపల్లి మీదుగా గన్నవరం చేరుకుంది. ఆత్కూరులో తెలంగాణా సాయుధ పోరాట వీరుడు అన్నే రామారావు విగ్రహానికి వి.శ్రీనివాసరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గన్నవరం ఆర్టీసీ బస్టాండ్ వద్ద సిపిఎం గన్నవరం మండల నాయకులు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. యాత్ర సారధి శ్రీనివాసరావుతో కలిసి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారామ్, సిహెచ్. బాబూరావు, వి.వెంకటేశ్వర్లు, వై.వెంకటేశ్వరరావు, సీనియర్ నాయకులు వై.కేశవరావు, పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు ఆర్. కృష్ణయ్య, కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి, ఎపి కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.హరిబాబు, అల్లూరి సీతారామరాజు, ఏలూరు జిల్లా కార్యదర్శులు వి.కిరణ్, ఎ.రవి, సిఐటియు నాయకులు నాగమణి, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.రఘు, చౌటపల్లి రవి, కళ్ళం వెంకటేశ్వరరావు తదితరులు యాత్రలో నడిచారు.


కృష్ణా జిల్లా జాతీయ రహదారి వెంబడి సాగుతున్న పోలవరం నిర్వాసితుల పోరుకేక మహాపాదయాత్ర

నిర్వాసితుల ఉగ్రరూపాన్ని చూడొద్దు

సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి కిరణ్

పోలవరం నిర్వాసితులను చిన్నచూపు చూసిన పాలకులు భవిష్యత్‌లో తగిన మూల్యం చెల్లిస్తారని సిపిఎం రంపచోడవరం జిల్లా కార్యదర్శి కిరణ్ చెప్పారు.బాపులపాడు మండలం వీరవల్లి ఎన్టీఆర్ బొమ్మ సెంటరులో జరిగిన సభలో ఆయన మాట్లాడారు. పోలవరం పోరుకేక మహాయాత్ర గత 13 రోజులుగా జరుగుతోందన్నారు. నిర్వాశితులు తమ బృందానికి అనేక సమస్యలు తెలియజేశారన్నారు. అయినా బాధితుల గోడు పాలకులకు వినిపించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. న్యాయమైన డిమాండ్లు పరిష్కరించమని కోరుతుంటే రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ పెడచెవిన పెట్టడం సరి కాదన్నారు. ప్రాజెక్టు పూర్తి కావాలంటే ముందుగా నిర్వాసితులకు పూర్తిస్థాయిలో న్యాయం చేసి తర్వాత ప్రాజెక్టును పూర్తి చేయాలన్నారు. గిరిజనులే కదా..ఏమి చేయలేరని అనుకుంటే పొరపడినట్లే అవుతుందన్నారు. వారి ఉగ్ర రూపాన్ని చూస్తే పాలకులు తట్టుకోలేరన్నారు.

పరిహారం అందించాకే ప్రాజెక్టు పూర్తిచేయాలి

సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కష్ణయ్య

పోలవరం ప్రాజెక్టు పూర్తయితే ఏపీ అంతటికి నీళ్ల అందుబాటులోకి వస్తాయని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కష్ణయ్య చెప్పారు. అయితే నిర్వాసితుల సమస్య పరిష్కరించిన తర్వాతే ప్రాజెక్టులు నిర్మాణం పూర్తి చేయాలని చట్టాలు చెబుతున్నా పాలకులు పెడచెవిన పెడుతున్నారన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద త్రీ గోర్జస్ ప్రాజెక్టు నిర్మాణానికి ముందే చైనా ప్రభుత్వం 10 లక్షల మందికి పునరావాస నగరాలను నిర్మించి ఇచ్చిందన్నారు. ఇంటికి ఒక ఉద్యోగం ఇచ్చిందన్నారు. రాష్ట్రంలో దీనికి భిన్నంగా పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి భూములు, గ్రామాలను త్యాగం చేసిన నిర్వాసితులకు న్యాయం చేయడానికి ప్రభుత్వాలు ముందుకు రావడం లేదన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కారణంగా లాభపడుతున్న మైదాన ప్రాంత ప్రజలు, నష్టపోతున్న నిర్వాసితుల పోరాటాలకు అండగా నిలవాలన్నారు.

ఐదేళ్ల పోరాటంతో పేదలకు ఇళ్లు

సిపిఎం కృష్ణా జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు

కోడూరుపాడు పంచాయతీలోని ఉమామహేశ్వరపురంలో యాత్రకు వ్యవసాయ కార్మికులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సిపిఎం కృష్ణాజిల్లా కార్యదర్శి వై.నరసింహారావు మాట్లాడుతూ ఉమామహేశ్వరపురంలో ప్రభుత్వ స్థలాల్లో ఇళ్ళు నిర్మించుకున్న వారికి అండగా పార్టీ ఆధ్వర్యంలో ఐదేళ్లపాటు నిర్వహించిన పోరాటం విజయం సాధించిందన్నారు. ఇళ్ళు నిర్మించుకున్న వారికి పొజిషన్ సర్టిఫికెట్లను అధికారులు అందించారన్నారు.


విరాళాలు సేకరిస్తున్న సిపిఎం నాయకులు

పాదయాత్రకు విరాళాల సేకరణ

ప్రజాశక్తి -అరకులోయరూరల్:పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి సిపిఎం ఆధ్వర్యంలో పోలవరం పోరుకేక పాదయాత్రకు సంఘీభావంగా ఆదివారం మండలంలోని సుంకరమెట్ట వారపు సంతలో సిపిఎం ఆధ్వర్యంలో విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి కె.రామారావు, నాయకులు పొద్దు బాలదేవ్, రామన్న మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యంతో పోలవరం బాధితులు తీవ్ర అన్యాయానికి గురవుతున్నారన్నారు.నిర్వాసితులకు పునరావాసం కల్పించకుండా ప్రభుత్వాలు మోసం చేస్తున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం అరకొర నిధులు కేటాయించి పోలవరం ముంపు ప్రాంతంలో ఉన్న ఆదివాసి గిరిజనులకు తీవ్ర అన్యాయం చేస్తుందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు, పద్మాపురం ఉపసర్పంచ్ జన్ని భగత్ రామ్, పాంగి నానిబాబు, సిహెచ్ గురుమూర్తి, గత్తుం బుజ్జి బాబు, జి.సత్యారావు, టి.జోషి, కె.బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు.


సిబ్బందికి సూచలు ఇస్తున్న డిటిసిఒ

కుష్టు రోగులను ఆదరిద్దాం


ప్రజాశక్తి-అరకులోయరూరల్:కుష్టు రోగులను ఆదరిద్దామని డిటిసిఒ విశ్వేశ్వరరావు నాయుడు పిలుపు నిచ్చారు. అరకులోయ మండలంలోని మాడగడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆదివారం పర్యటించి కుష్టు వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కుష్టు రోగుల పట్ల ప్రేమ భావంతో ఉండాలని కోరారు. స్పర్శ లేని మచ్చలు ఉన్నట్లయితే వెంటనే డాక్టర్లను సంప్రదించాలని సూచించారు. ప్రారంభ దశలో గుర్తించడంతో కుష్టు వ్యాధిని సులభంగా నయం చేసి అంగవైకల్యం రాకుండా కాపాడవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాడగడ పిహెచ్సి వైద్యులు ప్రశాంత్, హెచ్.భద్రయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మావోయిస్టుల డంప్ స్వాధీనం


బిఎస్ఎఫ్ పోలీసులు స్వాధీనం చేసుకున్న డంప్

ప్రజాశక్తి -సీలేరు: ఆంధ్ర ఒడిశా సరిహద్దుల్లో మావోయిస్టులకు చెందిన డంప్‌ను బిఎస్ఎఫ్ పోలీసులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. ఒడిశా పోలీసుల నుంచి అందిన సమాచారం మేరకు ఎఒబిలోని ఒడిశా మల్కన్‌గిరి జిల్లా, చిత్రకొండ సమితి జడంబ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అటవీ ప్రాంతంలో బిఎస్ఎఫ్‌పోలీసులు కూలింగ్‌కు వెళ్లగా మావోయిస్టులు డంప్ లభ్యమైంది. బిఎస్ఎఫ్ పోలీసులు గుర్తించిన డంప్‌ను బాంబుస్క్వాడ్‌తో పరిశీలించిన తర్వాత ప్రమాదం లేదని నిర్ధారించుకున్నాకే వెలికితీశారు. ఈడంప్‌లో రెండు దేశీయ తుపాకులు, తూటాలు, మూడు ఐఇడిలతోపాటు 55 జిలెటిన్ స్టిక్స్, ఇతర సామగ్రి 62 వస్తువులను ఒడిశా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.ఎఒబి ప్రత్యేక జోనల్ కమిటీకి చెందిన డంప్‌గా ఒడిస్సా పోలీసులు భావిస్తున్నారు. డంపు స్వాధీనం చేసుకున్న తర్వాత అదనపు పోలీసు బలగాలతో పరిసర ప్రాంతాల్లో గాలింపు చేపట్టారు.

మన్యం మామిడితాండ్రకు మంచి గిరాకీ


సీలేరు సంతలో అమ్ముతున్న మామిడి తాండ్ర ఉండలు

ప్రజాశక్తి -సీలేరు: మన్యంలో పండిన మామిడిపళ్లతో ఏజెన్సీవాసులు సహజసిద్ధంగా తయారుచేసిన తాజా మామిడితాండ్రకు మంచి గిరాకీ ఉంటుంది. సీలేరులో ఆదివారం వారపుసంతలో మామిడితాండ్ర ఉండలుహాట్ కేకుల్లా అమ్ముడుపోయాయి. మండలంలోని పిల్లిగెడ్డ, కాట్రగెడ్డ, దుప్పిలివాడ, చల్లని శిల్ప, కొమ్ములువాడ, తదితర మారుమూల గ్రామాల నుంచి గిరిజనులు తాము సొంతంగా తయారుచేసిన మామిడి తాండ్రను సీలేరు వారపుసంతకు అమ్మకానికి తేగా, ఒక్కో ఉండను రూ.50 చొప్పున విక్రయించగా, పలువురు ఎంతో ఆసక్తితో కొనుగోలు చేశారు.

మామిడి తాండ్రకుఈ ప్రాంతంలో ఒక ప్రత్యేకత ఉంది.చుట్టుపక్కల అటవీ ప్రాంతంలో పండిన మామిడిపళ్లను సేకరించి, వాటిని గుజ్జును తీసి, ఒక గుడ్డపై రోజూ వేసి ఎండలో ఆరబెడతారు. ఇలా దాదాపు ఇరవై రోజులపాటు అనేక పొరలుగా ఎండబెట్టిన మామిడి తాండ్రను తర్వాత ఈనెలుగా కోత కోసి, ఉండలుగా చుట్టి, వారపుసంతకు విక్రయానికి తెస్తారు. మైదానప్రాంతంలో తయారుచేసే మామిడి తాండ్ర కంటే ఏజెన్సీలో సహజసిద్ధంగా తయారుచేసిన మామిడితాండ్రను కొనేందుకు ప్రజలు మక్కువ చూపుతారు. ఆదివారం వారపుసంతలో తాండ్ర ఉండ రూ.50 చెప్పినప్పటికీ, పలువురు కొనుగోలు చేసేందుకు ఆసక్తి కనబరిచారు.

పరిశ్రమల స్థాపనకు రాయితీలు

-పథకాలతో ఎస్సీ, ఎస్టీ, యువతకు సదవకాశం
-35 శాతం వరకు సబ్సిడీ
-రూ.50 లక్షల వరకు రుణ సౌకర్యం
పరిశ్రమల శాఖ జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.నవీన్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు: **అల్లూరి జిల్లాలో గిరిజన యువత ప్రభుత్వం అందిస్తున్న పారిశ్రామిక రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని, పరిశ్రమల స్థాపనకు ముందుకు రావాలని పరిశ్రమల శాఖ అల్లూరి జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.నవీన్ కుమార్ పిలుపునిచ్చారు. పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం వివిధ పథకాల కింద రాయితీలను అందిస్తుందని ఆయన తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు రాయితీలకు ఆన్లైన్ వెబ్సైట్ ద్వారా జిల్లా పరిశ్రమల కేంద్రం, పాడేరుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుతో పాటు అర్హత ధ్రువ పత్రాలను అప్లోడ్ చేయాలని సూచించారు. ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో మరిన్ని వివరాలు ఆయన మాటల్లోనే.....**





పారిశ్రామిక ప్రగతికి పథకాలు ఏవీ?

కొత్త పరిశ్రమల (ప్రాజెక్టులు) ఏర్పాటుకు ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం (పీఎంఈజీపి) ఉంది. ఈ పథకం ద్వారా కొత్త పరిశ్రమలు, సర్వీస్ యూనిట్లు ఏర్పాటు చేసుకోవచ్చు. కొత్త పరిశ్రమలకు 25 లక్షలు, సర్వీస్ యూనిట్లకు పది లక్షల వరకు బ్యాంకు ద్వారా రుణాల పొందవచ్చు. దీనిపై ప్రభుత్వం 35శాతం సబ్సిడీ అందిస్తుంది. ఈ పథకం ద్వారా పరిశ్రమల స్థాపనకు 50 లక్షల వరకు రుణ సౌకర్యం పొందే అవకాశం ఉంది.

ఈ పథకానికి ఎవరు అర్హులు

ఈ పథకానికి దరఖాస్తు చేసుకునే అభ్యర్థులకు కనీస విద్యార్హత 8వ తరగతి ఉత్తీర్ణత ఉండాలి. స్వయం సహాయక సంఘాలు, సహకార సంఘాలు, చారిటీ ట్రస్టులతో పాటు 18 ఏళ్ళ పైబడిన వ్యక్తులు ఎవరైనా ఈ పథకం ద్వారా కొత్త పరిశ్రమ యూనిట్లు చేపట్టవచ్చు. ఈ పథకం ద్వారా 2022-23 సంవత్సరంలో 113 యూనిట్లు మంజూరు చేయించి ఇప్పటి వరకు 93 యూనిట్‌లు ప్రారంభించాము.

ఎస్సీ, ఎస్టీలకు ప్రత్యేక పథకం?

రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలకు ప్రత్యేకంగా జగనన్న బడుగు వికాస్ పథకం అమలు చేస్తోంది. దీనికి కూడా 35 శాతం రాయితీ ప్రభుత్వం అందిస్తుంది. ఈ పథకం ద్వారా పరిశ్రమలు, సర్వీస్ యూనిట్లు ఏర్పాటు చేసుకో దలచిన అభ్యర్థులు కూడా ఆన్లైన్లోనే దరఖాస్తు చేసుకోవాలి. ఈ పథకం మంజూరు కోసం ఈ ఏడాది జిల్లాలో ఇప్పటివరకు అర్హులైన అభ్యర్థుల నుంచి వచ్చిన 32 దరఖాస్తులు పరిశీలించి ప్రభుత్వ ఆమోదానికి పంపించాం.

రుణాల మంజూరు ఎలా?

సూక్ష్మ, చిన్న, మధ్య తరహా ఎంటర్ ప్రైజెస్(ఎమ్ఎస్ ఎంఈ) యూనిట్లను రిజిస్ట్రేషన్ చేసుకోవడం ద్వారా ఉద్యామ్ ధ్రువ పత్రం పొందితే వ్యాపార విస్తరణకు బ్యాంకుల ద్వారా రుణ సదుపాయం పొందడానికి ప్రాధాన్యత లభిస్తుంది. ఆన్లైన్లో రిజిస్ట్రేషన్ చేసుకుని ఈ ధృవపత్రం పొందవచ్చు. జిల్లాలో లక్ష్యానికి మించి ఈ ఏడాది 983 యూనిట్ల రిజిస్ట్రేషన్ నమోదు ఆన్లైన్ ద్వారా నిర్వహించాము.

ఏజెన్సీలో ప్రతిబంధకాలు?

అల్లూరి జిల్లా ఏజెన్సీ ప్రాంతంలో పరిశ్రమలు విస్తరణకు అనేక ప్రతిబంధకాలు ఉన్నాయి. ముఖ్యంగా రైలు మార్గం రోడ్డు మార్గాల సదుపాయాలు లేకపోవడంతో పరిశ్రమల ఏర్పాటుకు కొంత ఇబ్బంది ఏర్పడుతుంది. ఐదు లక్షలకు మించి యూనిట్లపై రుణ సదుపాయం కల్పించడానికి బ్యాంకులు ముందుకు రాని పరిస్థితి ఉంది. రెండు లక్షల రూపాయల వరకు బ్యాంకులు రుణ సదుపాయం కల్పిస్తుండడంతో వాటికి అనువైన పరిశ్రమల యూనిట్లు నెలకొల్ప గలుగుతున్నాం.

జిల్లాకు ప్రభుత్వ పెట్టుబడులు

అల్లూరి జిల్లాకు ప్రభుత్వం రూ.342 కోట్ల పెట్టుబడులు లక్ష్యంగా నిర్దేశించింది. ఈ మేరకు పరిశ్రమల స్థాపనకై యువత సంఘటితమై ముందుకు వస్తే ప్రభుత్వం అందించే పారిశ్రామిక రాయితీలు లభ్యం కావడమే కాకుండా. గిరిజన యువత ఉపాధి కల్పనకు దోహదం కలుగుతుంది. గిరిజన ప్రాంతంలోని యువకులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

అంగన్వాడీల సమస్యలపై.. 10, 11 తేదీల్లో 36 గంటల ధర్నా

ప్రజాశక్తి -పాడేరు: అంగన్వాడి వర్కర్స్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 10, 11 తేదీల్లో అల్లూరి జిల్లా కలెక్టరేట్ ముందు చేపట్టే 36 గంటల ధర్నా జయప్రదం చేయాలని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కే.భాగ్యలక్ష్మి పిలుపునిచ్చారు. ఆదివారం పాడేరు కేంద్రంలో గోడ పత్రికను ఆవిష్కరించారు. అనంతరం జిల్లా కార్యవర్గం సమావేశంలో ఆమె మాట్లాడుతూ, ఐసిడిఎస్ పరిరక్షణకు, అంగన్వాడిల ఉద్యోగ భద్రత, వేతనాలు పెంపునకు గత కొంతకాలంగా ఉద్యమిస్తున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకో లేదని తెలిపారు. ఇందుకోసం అఖిలభారత కోర్కెల దినం సందర్భంగా 36 గంటలు నిరసన కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు చెప్పారు. రోజురోజుకు నిత్యావసర ధరలు పెరిగిపోతున్నాయని, జీతాలు సరి పోలేదని తెలిపారు. వైసిపి అధికారంలోకి రాకముందు సీఎం జగన్ పాదయాత్రలో అంగన్వాడీలకు మెరుగైన సౌకర్యాలు, వేతనాలు, కార్మికులకు ఉద్యోగ భద్రత, కల్పిస్తామని హామీ ఇచ్చారని, కానీ నెరవేర్చ లేదన్నారు.

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, కేంద్రంలో బిజెపి అధికారం చేపట్టిన నాటి నుంచి ఐసిడిఎస్ బడ్జెట్ కుదిస్తుందరని, ఐసిడిఎస్ ను నిర్వీర్యం చేయాలని కుట్ర పన్నుతుందని విమర్శించారు. అంగన్వాడీలకు గ్రాట్యూటీ ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని సుప్రీంకోర్టు చెప్పినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించు కోలేదన్నారు. 1972 చట్టం ప్రకారం అంగన్వాడీలు గ్రాట్యుటీకి అర్హులని తెలిపారు. ఐసిడిఎస్ ప్రైవేటీ కరించాలనే కుట్రలో భాగంగా రకరకాల యాప్‌లు తెచ్చి పని భారం పెంచుతున్నారని విమర్శించారు. అంగన్వాడిల ఉద్యమానికి సిఐటియు అండగా ఉంటుందని తెలిపారు. ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కళావతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో యూనియన్ ఆఫీస్ బేరర్స్, పి.వెంకటలక్ష్మి, కే.కొండమ్మ, పెంటమ్మ, కొండమ్మ, మంజుల పాల్గొన్నారు.


మాట్లాడుతున్న భాగ్యలక్ష్మి

అక్రమ నిర్మాణాలను కూల్చి వేయాలి

ప్రజాశక్తి-హుకుంపేట:అక్రమ నిర్మాణాలపై మాట్లాడేందుకు స్థానిక చర్పంచ్ వెంకట పూర్ణిమకు నైతిక విలువ లేదని ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శి కె రామారావు, టి.కృష్ణారావు అన్నారు. ఆదివారం ఉదయం స్థానిక గిరిజన సంఘం కార్యక్రమంలో విలేకరులతో వారు మాట్లాడుతూ, స్థానిక సర్పంచ్ వెంకట పూర్ణిమ, వైస్ సర్పంచ్ గోవింద్‌ల తీరుని నాయకులు ఎండ గట్టారు. ఈ సందర్భం గా నాయకులు మాట్లా డుతూ, మండల కేంద్రంలో గిరిజనేతరుడు నల్లం కనకరాజుతో పాటు పలువురు అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నా ఎందుకు పిర్యాదు చేయలేదని ప్రశ్నించారు. తక్షణమే గిరిజనేతరుల అక్రమ నిర్మాణలు తొలగించాలని వారు డిమాండ్ చేశారు. వైస్ సర్పంచ్ కోడిదాసు గోవింద్ రెండు ఇళ్లు.రెండు షాపులు అక్రమంగా నిర్మాణాలను చేపడుతున్నారని, వీటిని తొలగించి మిగిలిన అక్రమ నిర్మాణలా పై మాట్లాడాలని వారు సూచించారు. ఆదివాసీ గిరిజన సంఘం దశబ్దాల కాలం నుండి 1/70 భూ బదలయింపూ చట్టం పటిష్టంగా అమలుకు అనేక ఉద్యమలు చేపడుతుందన్నారు.అక్రమ నిర్మాణల పై పోరాటలు సాగిస్తుంటే సర్పంచ్ వెంకట పూర్ణిమ కు కనబడక పోవడం విడ్డురంగా ఉందన్నారు. గతకొద్ది రోజులుగా మండల కేంద్రంలో శాశ్వత నిర్మాణకు రెండు మూడు అంతస్తుల కడుతున్నా సర్పంచ్ కి ఎందుకు కానబడలేదని వారు ప్రశ్నించారు.



మాట్లాడుతున్న నాయకులు

23న టిడబ్ల్యుటియు ఎన్నికలు

ప్రజాశక్తి -పాడేరు: గిరిజన సంక్షేమ ఉపాధ్యాయుల సంఘం విశాఖపట్నం ఉమ్మడి జిల్లా శాఖ సర్వసభ్య సమావేశం ఆదివారం స్థానిక తలారసింగి ఆశ్రమ ఉన్నత పాఠశాలలో జిల్లా అధ్యక్షుడు కుర్తాడి రామారావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. ఈ మేరకు గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం రాజీ లేని పోరాటాలు కొనసాగించాలని నిర్ణయించారు. ఈ నెల 23న స్థానిక తలారసింగి గిరిజన సంక్షేమ ఉన్నత పాఠశాలలో ఎన్నికలు నిర్వహించేందుకు తీర్మానించారు. ఈ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రేగం సూర్యనారాయణ, అసోసియేట్ అధ్యక్షులు ఫలాసి కృష్ణారావు, గౌరవ అధ్యక్షులు శ్రీనివాస్ పడాల్, వివిధ మండలాల నుంచి గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘం మండల కమిటీ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

అనంతగిరిలో కుండపోత వాన

ప్రజాశక్తి-అనంతగిరి:అనంతగిరిలో రెండు గంటలపాటు కుండపోత వాన కురిసింది. ఎండలతో ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజానీకానికి వర్షంతో ఉపశమనం కలిగింది. ఆదివారం మధ్యాహ్నం 3 గంటల నుండి 5 గంటల వరకు ఏకధాటిగా ఉరుములతో కూడిన భారీ కుండపోతవాన కురిసింది. రైతన్నలు వ్యవసాయ పనులు చేపట్టేందుకు ముందుకు సాగుతున్నారు. భారీ వర్షంతో పంట పొలాలలో నీరు చేరింది. గెడ్డలు పొంగి ప్రవహించాయి.

4 నుంచి జగనన్న సురక్ష

ప్రజాశక్తి- పెదబయలు :మండలంలో ఈనెల 4నుండి 20 వరకు జగనన్న సురక్ష కార్యక్రమకాన్ని 16 సచివాలయాల్లో షెడ్యూల్ ప్రకారం అమలు జరిగేలా చర్యలు తీసుకోనున్నట్లు ఎంపీడీఓ ఎల్.పూర్ణయ్య తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రతి రోజు రెండు సచివాలయాల చొప్పున మండల పరిషత్ అభివృద్ధి అధికారి, తహసీల్దార్ టీమ్ ఇంటింటికి వెళ్లి సర్వేను పరిశీలిస్తారన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరమై ఉన్న వారిని గుర్తించి అర్హత పొందేందుకు తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ధ్రువపత్రాలు జారీకి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

9న మోదమ్మ శాకాంబరి ఉత్సవం

ప్రజాశక్తి-పాడేరు:మన్య ప్రజల ఆరాధ్య దైవం మోదకొండమ్మ అమ్మవారి శాకాంబరి మహోత్సవం ఈ నెల 9న ఆదివారం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్ పర్సన్, స్థానిక శాసనసభ్యులు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొట్టగుల్లి సింహాచలం నాయుడు ఆదివారం విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం ఆనవాయితీగా ఆషాడ మాసంలో నిర్వహిస్తున్న శాకంబరీ ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా మోదకొండమ్మ అమ్మవారిని శాకములతో ప్రత్యేక అలంకరణ చేసి శాకంబరీ రూపంలో భక్తులకు ప్రత్యేక దర్శనం కల్పిస్తున్నట్లు వారు తెలిపారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని చెప్పారు. ఆలయం వద్ద భక్తులకు అన్నప్రసాద నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

గ్రామాల్లో సమస్యలపై 4 నుంచి సిపిఎం సర్వే

ప్రజాశక్తి -పద్మనాభం : గ్రామాల్లో సమస్యలపై సిపిఎం ఆధ్వర్యాన ఈ నెల 4వ తేదీ నుంచి 10వ తేదీ వరకు సర్వే నిర్వహిస్తామని జివిఎంసి 72వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు తెలిపారు. పలు గ్రామాల నుంచి వచ్చిన కార్యకర్తలతో ఆదివారం సమావేశమై మాట్లాడారు. పద్మనాభం మండలంలో ల్యాండ్ పూలింగ్ సమస్యలు ఎక్కువగా ఉన్నాయని రైతుల ఆందోళన చెందుతున్నారని, దీనిపై పక్కాగా సర్వే చేసి రైతులకు అండగా నిలుస్తామని చెప్పారు. ఆగస్టు నెలాఖరు నాటికి సర్వేను పూర్తి చేయాలని, అందుకు అందరి సహకారం కావాలని కోరారు. ప్రభుత్వాలే చట్ట వ్యతిరేక పనులకు పాల్పడితే పేద, బలహీన వర్గాలకు న్యాయం ఎక్కడ దొరుకుతుందన్నారు. మజ్జివలస రాజకుటుంబానికి చెందిన వైసిపి నాయకుడు భీమిలి మండలం లక్ష్మీపురం గ్రామంలో సుమారు 5 ఎకరాల భూమిని తన రాజకీయ పలుకుబడితో స్వాధీనం చేసుకోవడానికి అన్ని ఏర్పాట్లు చేసుకున్నాడని, రైతుల నిలదీయడంతో భూమిపైకి రాలేకపోయాడని తెలిపారు. పద్మనాభం మండలంలో కనీసం ఉపాధి లేక ఎంతో మంది ఇబ్బందులు పడుతున్నారన్నారు. గ్రామస్థాయిలో ప్రజలు సమస్యలను ముందుకు తీసుకొస్తే జిల్లా కలెక్టర్ దృష్టిలో పెడతామని చెప్పారు. నిరుపేద రైతుల దగ్గర ఉన్న భూములకు 22ఎ కింద చూపించి నిషేధించడం అన్యాయమన్నారు. గ్రామాల్లో సంఘాలు ఏర్పాటు చేసుకుంటే సమస్యలపై పోరాటం చేయగలుగుతామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఆర్ఎస్ఎన్.మూర్తి, రవ్వ నర్సింగరావు, రాము, చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనేతర ఉపాధ్యాయులను వెనక్కి పంపాలి

గిరిజన ఉద్యోగుల సంఘం



సమావేశంలో మాట్లాడుతున్న శేషాద్రి

ప్రజాశక్తి-పాడేరుటౌన్:షెడ్యూల్డ్ ప్రాంతంలో గిరిజనేతర ఉపాధ్యాయులను బదిలీలను, నియామకాలను వెంటనే రద్దు చేసి వారికి వెనక్కి పంపాలని అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ముఖి శేషాద్రి, బోయ సింహాచలం డిమాండ్ చేశారు. ఆదివారం అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు గిరిజన ఉద్యోగుల సంఘ భవనంలో సమావేశమై మాట్లాడారు. జిఒ-3పై సుప్రీం కోర్టులో పిటిషన్ నడుస్తుండగా ఏజెన్సీలో మైదాన ప్రాంతానికి చెందిన సుమారు 400 మంది గిరిజనేతర ఉపాధ్యాయులను బదిలీ చేయడం తగదన్నారు. 98 డిఎస్‌సి ద్వారా సుమారు 288 మంది గిరిజనేతర ఉద్యోగులను గిరిజన ప్రాంతానికి పోస్టింగులు ఇవ్వడం గిరిజనుల హక్కులకు తీవ్ర భంగం కలిగించడ మేనన్నారు.

అక్రమ కట్టడాన్ని నిలుపుదల చేయాలి

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:అరకు సంత బయలు గ్రామం లోని రచ్చబండ సమీపం వద్ద గిరిజన చట్టాలను ఉల్లంఘిస్తూ గిరిజనేతరుడు నిర్మిస్తున్న అక్రమ శాశ్వత గృహాన్ని వెంటనే నిలుపదల చేయాలని మానవ హక్కుల నేర నిరోధక సంఘం అల్లూరి జిల్లా అధ్యక్షుడు పి ధర్మ, జిల్లా నాయకుడు పి.రామలింగం డిమాండ్ చేశారు. ఆదివారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, గ్రామంలో గిరిజన నేతరుడు నిర్మిస్తున్నట్లు సంబంధిత రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా నిలుపుదలకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. ప్రభుత్వ స్థలాలు అరకులో అన్యక్రాంతం అవుతున్నా రెవెన్యూ అధికారులు పట్టీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారన్నారు. తక్షణమే అక్రమ కట్టడాన్ని తొలగించాలని, లేనిపక్షంలో జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

పాముకాటుతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి- హుకుంపేట:పాము కాటుకు గురై ఒ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి మండలం లోని పట్టాం పంచాయతీ అదే గ్రామానికి చెందిన సొభ హరినాద్(32) శనివారం ఉదయం తమ గ్రామం నుంచి కుమ్మరి పుట్టు గ్రామంలో క్రింద పొలం పనులు నిమిత్తం వరి కోతలు కోసేందు వేళారు. వరి కోతలు కోస్తున్న క్రమంలో ఎడమ కాలుకి పాము కాటు వేయడంతో అక్కడికక్కడే స్పృహ కోల్పోయాడు. ఆటోలో పట్టాం నుండి ఉప్పు ఆరోగ్య కేంద్రానికి తరలించారు. పాడేరు జిల్లా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు జిల్లా వైద్యులు తెలిపారు. పిహెచ్‌సిలో రాత్రి వేళలో వైద్యులను నియమించాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి టీ.కృష్ణారావు కోరారు.

ఉరేసుకుని బాలిక ఆత్మహత్య

ప్రజాశక్తి అనంతగిరి:బాలిక ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాటిని ఘటన మండలంలోని బీంపోలులో చోటు చేసుకున్న విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. స్థానికుల కథనం మేరకు... మండలంలోని నాన్ షెడ్యూల్ బీంపోలు పంచాయతీ పరిధి నేరడివలస గ్రామానికి చెందిన మూతు బోయిన. విజయ (14) గత నెల 21న గ్రామానికి సమీపంలో ఉన్న చెట్టుకు ఉరి వేసుకంది.తల్లిదండ్రులు మందలించారని మనస్థాపానికి గురైన విజయ ఇంటి నుంచి వెళ్లిపోయింది.సమీప గ్రామాలు, బంధువుల ఇళ్ల వద్దకు వెళ్లి గాలించినప్పటికీ కనిపించ లేదు. ఆదివారం చెట్టుకు వేలాడుతున్న మృతదేహాన్ని పశువుల కాపరులు గుర్తించి కుటుంబ సభ్యులకు తెలిపారు. స్థానిక పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం ఎస్.కోటకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నాట్లు ఎస్ఐ రాము పేర్కొన్నారు.

వైభవంగా గిరి ప్రదక్షిణ

లక్షలాదిగా తరలివచ్చిన భక్తులు



గిరిప్రదక్షిణ రథం వద్ద సిద్ధంగా ఉన్న భక్తులు

ప్రజాశక్తి-యంత్రాంగం

సింహాచలం: ఆషాడ పౌర్ణమి రోజున చేపట్టే గిరిప్రదక్షిణను ఆదివారం మధ్యాహ్నం దేవస్థానం ప్రచార రథానికి జెండా ఊపి అధికారికంగా ప్రారంభించారు. నగర పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్‌వర్మ, వార్డు కార్పొరేటర్ పీవీ నరసింహం, ట్రస్ట్ బోర్డు సభ్యులు పాల్గొని రథాన్ని ప్రారంభించారు. సుదూర ప్రాంతాలనుంచి వచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దేవస్థానం అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. ప్రతి కిలోమీటర్‌కూ భక్తులకు అందుబాటులో మంచినీరు, సేద తీరేందుకు కుర్చీలు, టేబుల్స్ అందుబాటులో ఉంచారు. కొండచుట్టూ 32 కిలోమీటర్లు గిరిప్రదక్షిణలో భాగంగా భక్తుల కోసం సుమారు 200 తాత్కాలిక మరుగుదొడ్లను ఏర్పాటు చేశారు. భక్తులకు దారిపొడవునా స్వచ్ఛంద సేవా సంస్థలు కాఫీ, ఫలహారాలతో పాటు టిఫిన్, భోజనాలను ఉచితంగా అందించారు. దేవస్థానం వారు ఎక్కడికక్కడ వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. గోశాల వద్ద ఆయుష్మాన్‌భవ ఆసుపత్రి ఎమ్‌డి కర్రి అప్పలస్వామి ఆధ్వర్యాన వైద్య శిబిరాన్ని ఏర్పాటుచేసి భక్తులకు సేవలందించారు.

తొలి పావంచ వద్ద కొబ్బరికాయ కొట్టే సమయంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఎక్కువ కౌంటర్లను ఏర్పాటుచేశారు. భక్తులు నడిచే ప్రదేశంలో చెత్త లేకుండా పారిశుధ్య కార్మికుల తమ వంతు సేవలను అందించారు. అప్పుఘర్, జోడుగుళ్లపాలెం తదితత సముద్ర ప్రాంతాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా గజ ఈతగాలను అందుబాటులో ఉంచారు. తప్పిపోయే భక్తులను వారి బంధువులకు తెలియజేసేందుకు ఎక్కడ అక్కడ ప్రచారం చేసే కౌంటర్లు అందుబాటులో ఉంచారు. ఎండను, సాయంత్రం వర్షాన్ని సైతం లెక్కచేయక భక్తులు గిరి ప్రదక్షిణలో పాల్గొన్నారు. ఈ ఏడాది భక్తులు సుమారు ఆరేడులక్షల మంది గిరి ప్రదక్షిణలో పాల్గొన్నట్టు ఓ అంచనా. ఈ ఏడాది స్వామి వారి ప్రచార రథం సుమారు నాలుగు గంటల ప్రాంతానికే హనుమంతువాక దాటి వెళ్లడంపై భక్తులు అసహనం వ్యక్తం చేశారు. 32 కిలోమీటర్ల దారి పొడవునా పూర్తిస్థాయిలో వీధిదీపాలు ఏర్పాటు చేయడంతో భక్తులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా యాత్ర సాగించారు. ఈ ఏడాది ఆదివారం ఉదయం 6 గంటల నుంచే భక్తులు గిరిప్రదక్షిణలో పాల్గొనడం కనిపించింది.

గిరిప్రదక్షిణకు భక్తులు

పద్మనాభం : సింహాచలం గిరి ప్రదక్షిణకు విజయనగరం జిల్లాలోని పలు గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పద్మనాభం మీదుగా వాహనాలపై తరలివెళ్తున్నారు. ఈ భక్తులతో ఆర్టీసీ బస్సులు కూడా రద్దీగా తిరుగుతున్నాయి.

మందుల పంపిణీ

ఆరిలోవ : సింహగిరి ప్రదక్షిణ చేసే భక్తులకు స్థానిక 12వ వార్డు పెదగదిలి కూడలిలో వైసిపి సీనియర్ నాయకులు ఇజ్జాడ సత్యనారాయణ ఆధ్వర్యాన మెడికవర్ ఆసుపత్రి సౌజన్యంతో భక్తులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్, వైసిపి నాయకులు అక్కరమాని వెంకటరావు హాజరై భక్తులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎపి రాష్ట్ర సాంస్కృతిక విభాగం డైరెక్టర్ ధూళి రఘు, రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జీరా రైస్, మజ్జిగ పంపిణీ

పిఎం పాలెం : గిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులకు తెలుగు యువత ఉపాధ్యక్షులు గరే గురునాథ్ ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన జీరా రైస్, మజ్జిగ, బిస్కెట్లు, చాక్లెట్లు, శీతల పానీయాలను పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా భీమిలి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి కోరాడ రాజబాబు హాజరై ప్రసాదం అందించారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సత్యనారాయణ, పోతిన రమణ, పిల్లా రమేష్, పోతిన నాయుడుబాబు, దాస్, పిల్లా శ్రీను, గుజ్జారి రాజు, పిల్లా నరేష్, సిహెచ్.ప్రసాద్, రమణ, కెవిఆర్ కేటరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.



తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

పోలీసుల విస్తృత తనిఖీలు

ప్రజాశక్తి - సీలేరు: సీలేరు పరిసర ప్రాంతాల్లో పోలీసులు ముమ్మర వాహన తనిఖీలు, గాలింపు చర్యలు చేపట్టారు. సీలేరు ఎస్ఐ రామకృష్ణ ఆధ్వర్యంలో స్థానిక పోలీసులతోపాటు సిఆర్‌పిఎఫ్ బృందాల ఆధ్వర్యంలో ఎపి జెన్‌కో చెక్‌పోస్టు, రామాలయం సెంటర్, ఐటిఐ జంక్షన్ వంటి ప్రధాన కూడళ్లతోపాటు సీలేరు ఆదివారం వారపు సంతలోనూ ముమ్మర తనిఖీలు నిర్వహించారు. అనుమానిత వ్యక్తులు, అపరిచితులే లక్ష్యంగా ప్రత్యేక నిఘా పెట్టి తనిఖీలు చేసిన పోలీసులు, వారిని ప్రశ్నించి, నిర్ధారించుకున్నాకే విడిచిపెట్టారు. ఒడిశా సరిహద్దు ప్రాంతాల నుంచి రాకపోకలు సాగించే వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించి విడిచిపెట్టారు. వారపుసంతలోనూ తనిఖీలు నిర్వహించిన పోలీసులు అనుమానితులు, కొత్త వ్యక్తులు కదలికలపై ప్రత్యేక దృష్టిపెట్టారు. గంజాయి అక్రమ రవాణా,వారికి సహకరిస్తున్న వారి వివరాలపై సంతకు వచ్చిన మారుమూల ప్రాంతాల గిరిజనులను ప్రశ్నించారు. ఆంధ్ర, ఒడిశా, తెలంగాణ రాష్ట్రాల నుంచి వచ్చే పోయే వాహనాలు తనిఖీ చేశామని, గంజాయి అక్రమ రవాణా, వారికి సహకరిస్తున్న వారిపై నిఘా పెట్టి తనఖీలు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

జిఒ 117 రద్దుకు పోరాటం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : జిఒ 117ను రద్దు చేసి ప్రభుత్వ విద్యా రంగాన్ని పరిరక్షించాలని, సిపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.భానుమూర్తి, ఎఎస్.గణపతి డిమాండ్ చేశారు. విద్య, ఉపాధ్యాయ రంగాల అపరిష్కృత సమస్యల పరిష్కారానికి ఫ్యాప్టో దశల వారీ ఉద్యమంలో భాగంగా సమాఖ్య జిల్లా సదస్సు ఎపి పెన్షనర్స్ అసోసియేషన్ హాల్‌లో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిఒ 117తో విద్యారంగం పెను సంక్షోభంలో కూరుకుపోయిందని అన్నారు. ఈ జిఒ వల్ల వేలాది పాఠశాలల విలీనం, వేలాది ఉపాధ్యాయుల పోస్టులు రద్దు అవుతున్నాయన్నారు. వినాశకరమైన ఈ జిఒను తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సిపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలన్నారు. పాత పిఆర్‌సి బకాయిలు చెల్లించాలని, ఆ తర్వాతే 12వ పిఆర్‌సికి పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవాలని అన్నారు. సదస్సుకు ఫ్యాప్టో జిల్లా చైర్మన్ గొండు షణ్ముఖరావు అధ్యక్షత వహించారు. రాష్ట్ర కో చైర్మన్ సిహెచ్.వెంకటేశ్వర్లు, అనకాపల్లి జిల్లా అధ్యక్షులు గొంది చిన్నబ్బాయి, సెక్రటరీ జనరల్ వై.సుధాకర్, ఎఎస్ఆర్ జిల్లా చైర్మన్ జె.జగన్మోహన్, ఎపిటిఎఫ్ నాయకులు బి.వెంకటపతి రాజు, టి.రామకృష్ణారావు, ఎన్.సన్యాసినాయుడు, యుటిఎఫ్ నాయకులు దాసరి నాగేశ్వరరావు, టిఆర్.అంబేద్కర్, వి.శ్రీలక్ష్మి, ఐ.రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మించాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : అచ్యుతాపురం సెజ్‌లోని పరిశ్రమల్లో వేలాది మంది కార్మికులు పనిచేస్తున్నారని, వీరు నిత్యం జరుగుతున్న ప్రమాదాలలో మృత్యువాత పడటం, గాయాలపాలవడం పరిపాటిగా మారిన నేపథ్యంలో అచ్యుతాపురం కేంద్రంగా వంద పడకల ఇఎస్ఐ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మించాలని సిఐటియు అనకాపల్లి జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.రాము డిమాండ్ చేశారు. సాహితీ ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్‌లో మూడు రోజుల క్రితం జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కెజిహెచ్, ఇండస్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న సాదిరెడ్డి రాజబాబు, సమ్మెంగి అప్పారావు, సింగంశెట్టి నూకి నాయుడు, రామేశ్వర్, పిల్లా సంతోష్ కుమార్‌లను ఆదివారం ఆయన పరామర్శించారు. బాధిత కుటుంబాలను ఓదార్చారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ క్షతగాత్రుల్లో పిల్లా సంతోష్ కుమార్ తప్ప మిగతా నలుగురి పరిస్థితీ విషమంగానే ఉందన్నారు.

బిసి హాస్టల్‌లో భయం..భయం!

కూలిన ప్రహరీ
అమలుకు నోచుకోని మెనూ
అవస్థలు పడుతున్న బాలికలు
పట్టించుకోని అధికారులు, నేతలు

ప్రజాశక్తి-చింతూరు : డివిజన్ కేంద్రమైన చింతూరులోని బిసి బాలికల హాస్టల్ నిర్వహణ దయనీయంగా ఉంది. ఏడాదిగా రెగ్యులర్ వార్డెన్ లేక విద్యార్థినుల బాగోగులు పట్టించుకునే దిక్కులేకపోగా, ఈ హాస్టల్‌లో ఉండే బాలికలకు రక్షణ ప్రశ్నార్థకంగా మారింది. సరైన పర్యవేక్షణ లేని హాస్టల్ ప్రహరీ ముక్కలుముక్కలుగా కూలిపోతోంది. ఎలాంటి ప్రమాదం వస్తుందోనని భయంతో విద్యాసంవత్సరం ప్రారంభమై ఇరవైరోజులు గడచినా నేటికీ ఒక్క బాలికైనా హాస్టల్‌కు రాలేదంటే, ఇక్కడ పరిస్థితులు ఎంత అధ్వానంగా ఉన్నాయో స్పష్టమౌతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, హాస్టల్‌లోని పరిస్థితులను చక్కదిద్దాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

సీలేరులోని బిసి బాలికల హాస్టల్ వార్డెన్‌కు ఏడాది క్రితం రంపచోడవరం బదిలీ అయ్యింది. వేరే వార్డెన్‌ను నియమించని పరిస్థితుల్లో ఏడాదిగా అదే వార్డెన్ ఇన్‌ఛార్జి బాధ్యతలు నిర్వహిస్తున్నారు.



కూలిపోయిన ప్రహరీ



సమస్యలకు నిలయంగా ఉన్న బిసి బాలికల హాస్టల్

తీరిక ఉన్నపుడు ఎపుడో ఒకసారి మొక్కుబడిగా వచ్చిపోతున్న వార్డెన్‌తో, ఇక్కడి హాస్టల్ విద్యార్థినుల బాగోగులు పట్టించుకునే నాథులే లేకుండా పోయారు. మెనూ సక్రమంగా అమలు కావడం లేదు. హాస్టల్ భవనం చుట్టూ ఉన్న ప్రహరీ ముక్కలుముక్కలుగా కూలిపోతోంది. ప్రస్తుతం తూర్పువైపున ఉన్న గోడ కూలిపోయింది. ఆర్‌టిసి బస్‌స్టాండ్‌కు వెళ్లే వైపునున్న ప్రహరీ గోడ కూలిపోవడంతో లోపలున్న విద్యార్థినులకు రక్షణ లేకుండా పోయిందని విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు. ఎవరైనా ఆగంతకులు హాస్టల్ లోపలికి చొరబడితే పరిస్థితి ఏంటనే భయాందోళనలూ ఉన్నాయి. ఇదే కాకుండా మరోవైపున ఉన్న ప్రహరీ కూడా ఏక్షణాన్నైనా కూలేందుకు సిద్ధంగా ఉంది. విద్యార్థినులు అటుగా వెళితే ఏం ప్రమాదం ముంచుకొస్తుందోనన్న ఆందోళన వ్యక్తమౌతోంది.

హాస్టల్‌లోని దుర్భర పరిస్థితులు ఇలా ఉండడంతో ఈ ఏడాది ఇప్పటివరకు విద్యార్థినులెవరూ హాస్టల్‌కు వచ్చిన పాపాన పోలేదు. డివిజన్ కేంద్రంలోని హాస్టల్ అధ్వానపరిస్థితులపై పత్రికల్లో కథనాలు వస్తున్నా అధికారుల్లో కదలిక లేదు. విద్యార్థుల తల్లిదండ్రులతోపాటు స్థానికులు, ప్రజాసంఘాలు పలుమార్లు మొరపెట్టుకున్నా పట్టించుకునే దిక్కులేదు. డివిజన్ కేంద్రంలోని హాస్టల్‌పైనా, అందులోనూ బాలికలుండే వసతిగృహంపైనే అధికారులు, నేతలు ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటే, మిగతా చోట్ల హాస్టళ్ల నిర్వహణ ఎలా ఉంటుందో ఇట్టే స్పష్టమౌతోందన్న ఆరోపణలూ ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, తగు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

అగమ్యగోచరంగా బాలారం ఏకలవ్య పాఠశాల

వసతి సౌకర్యం లేక
వేర్వేరు పాఠశాలల్లో నిర్వహణ
- తాళ్లపాలెం తరలింపుపై తల్లిదండ్రుల ఆందోళన

ప్రజాశక్తి-కొయ్యూరు : మండలంలోని బాలారంలో ఏకలవ్య పాఠశాల మంజూరై ఐదేళ్లుగా గడుస్తున్నా నేటికీ సొంత గూడు సమకూర్చే పరిస్థితి లేకపోవడం దారుణమని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు. ఏకలవ్య పాఠశాల మంజూరు కావడం, విద్యార్థులకు ప్రవేశాలు కల్పించిన అధికారులు, వసతి లేకపోవడంతో బాలికలను చింతపల్లి ఏకలవ్య పాఠశాలకు, బాలురిని స్థానిక ఎపి రెసిడెన్షియల్ స్కూల్‌లో ఉంచి చదివిస్తున్నారు. ఏకలవ్య పాఠశాలలో విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థులు కొందరు చదువు పూర్తిచేసుకుని బయటపడినా, తాము ఏపాఠశాలలో చదివారో చెప్పే పరిస్థితి లేని విధంగా ఐదేళ్లుగా నెట్టుకుంటూ వచ్చారని పలువురు వాపోతున్నారు. ఇదిలా ఉంటే తాజాగా బాలారం ఏకలవ్య పాఠశాలను రాజవొమ్మంగి మండలం తాళ్లపాలెంలో నిర్వహించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారనే సమచారంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. బాలారంలో ఏకలవ్య పాఠశాల ఉంటుందని, తమ పిల్లలను పాఠశాలకు వసతి సౌకర్యం లేనప్పటికీ, ఒకటి రెండేళ్లలో సమకూర్చకపోతారా అన్న ఆశతో తమ పిల్లలను చేర్పిస్తే, ఐదేళ్లుగా అక్కడ, ఇక్కడ చదివిస్తూ, ఇపుడు ఏకంగా హెడ్‌క్వార్టర్స్‌కు దూరంగాఉన్న తాళ్లపాలెం తరలించడంపై ఆందోళన చెందుతున్నారు. అక్కడ తమ పిల్లలకు వైద్యపరమైన సమస్యలు తలెత్తితే పరిస్థితి ఏంటని ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతానికి ఇక్కడే ఇపుడున్న విధంగా బాలికలు, బాలురకు స్థానికంగా వేర్వేరు పాఠశాలల్లో చదువులు కొనసాగించినా పర్వాలేదుగానీ, తాళ్లపాలేనికి మాత్రం తరలించవద్దని వేడుకుంటున్నారు. అంతేకాక బాలారం ఏకలవ్య పాఠశాలకు సొంత భవనాలను త్వరితగతిన నిర్మాణం చేపట్టాలని అభ్యర్థిస్తున్నారు. హాస్టల్స్‌లో పిల్లలకు ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా చూసేందుక హెల్త్‌వర్కర్ లేదా ఎఎన్ఎంను నియమించాలని కోరుతున్నారు.



వారపు సంతలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న టమాటా

కొండెక్కిన కూరగాయల ధరలు

- రూ.120 పలికిన టమాటా

ప్రజాశక్తి - సీలేరు : సీలేరు వారపుసంతలో కూరగాయల ధరలు ఆకాశాన్నంటాయి. టమోటా రేటు సెంచరీ దాటేసి, రూ.120 పలికింది. దీంతో సంతకు కూరగాయలు కొనేందుకు వచ్చిన వినియోగదారులు సగం సంచులతోనే ఇంటికి వెళ్లడం కనిపించింది. గత వారం వారపు సంతలో కిలో రూ.60లకు అమ్ముడుపోయిన టమోటా, ఈవారం ఏకంగా రెట్టింపైంది. కిలో టమోటా రూ.120 చెప్పడంతో మామూలు జనం అటువైపు చూడడం మానేశారు. ఎపి జెన్‌కో ఉద్యోగులు, కార్మికులుమాత్రం అరకొరగా కొనుగోలు చేశారు. ఇక పచ్చిమిర్చి రేటు ఒక్కసారిగా ఘాటెక్కింది . కిలో మిరపకాయలు రూ.200లకు విక్రయించారు. ఇక బెండకాయలు రూ.60, బీరకాయలు రూ.80, బీట్‌రూట్ రూ.80, క్యారెట్ రూ.80 ఇలా అన్ని కూరగాయల ధరలు భారీగానే పెరిగాయి. రూపాయలకి వారపు సంతలో వ్యాపారులు విక్రయాలు జరిపారు.కిలో బెండకాయ 60 బీరకాయలు కిలో 80 బీట్రూట్ కిలో 80 క్యారెట్ కిలో 80 రేట్లు గా వ్యాపారులు నిర్ణయించి విక్రయాలు జరిపారు. ఆకాశాన్నంటిన కూరగాయలు కొనేందుకు గిరిజనం అంతగా ఆసక్తి చూపకపోవడం విశేషం.



కన్నయ్య పార్థివ దేహం వద్ద నివాళ్లర్పిస్తున్న నాయకులు

టిడిపి నేత మృతికి సంతాపం

ప్రజాశక్తి-విఆర్.పురం: మండలం ములకనపల్లి పంచాయతీ కొత్తపేట గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త శీలం కన్నయ్య (42) మృతి చెందాడు. శనివారం తాటిచెట్టుపై నుంచి ప్రమాదవశాత్తు పడిపోవడంతో కన్నయ్య మృతి చెందాడని కుటుంబసభ్యులు, టిడిపి నేతలు తెలిపారు. ఆదివారం కన్నయ్య మృతదేహానికి జెడ్‌పిటిసి వాళ్ళ రంగారెడ్డి, మాజీ జెడ్‌పిటిసి ముత్యాల రామారావు, కార్యదర్శి బురక కన్నారావు, సొసైటీ మాజీ చైర్మన్ ముత్యాల చంద్రశేఖర్, తెలుగు మహిళ అధ్యక్షురాలు ఆకోజు భాగ్యలక్ష్మి, ఆకోజు రంగాచారి, తెల్లం అప్పారావు, తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కన్నయ్య హఠాన్మరణం ఆ కుటుంబంతోపాటు పార్టీకి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి టిడిపి ఎల్లపుడూ అండగా ఉంటుందని భరోసానిచ్చారు. మృతుడు కన్నయ్యకు భార్య, కొడుకు శ్రీరామ్‌కృష్ణ ఉన్నారు.